మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి సన్మానం

నగరానికి విచ్చేసిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్‌ను శనివారం బీజేపీ నాయకులు సన్మానించారు. ఓ హోటల్‌లో ఆయనను కలిసిన బీజేపీ నాయకులు గోవింద్ నారాయణ్‌రాథి, మనోజ్ జైస్వాల్, సుమిత్ రాథి తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. – అబిడ్స్, మే 25

గ్రాండ్ హెల్త్ చాలెంజ్..

కాచిగూడ, మే 25: ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మే 25 నుంచి జూన్ 1 వరకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమాన్ని ఆర్టీసీ సంస్థ నిర్వహిస్తున్నదని కాచిగూడ డిపో మేనేజర్ టి. రఘు తెలిపారు. శనివారం డిపోలో పనిచేస్తున్న కార్మికుల కోసం హెల్త్ చాలెంజ్ పేరుతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం రఘు మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం ఆర్టీసీ కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరగౌడ్, శ్రీనివాసులు, వాసవి, రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఝాంసింగ్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కార్వాన్, మే 25 : శ్రీ ఝాంసింగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం ఈఓ కృష్ణారావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో అధికారులు

- 14 టేబుల్‌ల ద్వారా 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు చర్యలు

అబిడ్స్, మే 25 : పార్లమెంట్ ఎన్నికల లోని ప్రధాన ఘట్టమైన ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన చేపట్టనుండగా అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేపడుతున్నారు. ఓట్ల లెక్కింపును ప్రారంభించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 2,74,522 ఓట్లకుగాను 1,50,207 ఓట్లు నమోదయ్యాయి. జూన్ 4వ తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. 14 టేబుల్‌ల ద్వారా 17 రౌండ్‌లలో ఈ ఓట్ల లెక్కింపు జరగనుంది. జూన్ 4వ తేదీన స్ట్రాంగ్ రూంలో భద్ర పర్చిన ఈవీఎంలను బయటకు తీసి వివిధ పార్టీలకు చెందిన ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపును ప్రారంభించి 17 రౌండ్లలో పూర్తి చేస్తారు. కట్టుదిట్టమైన భద్రతలో ఉంచిన ఈవీఎంలను పార్టీ అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్‌లు, ఎన్నికల పర్యవేక్షకుల సమక్షంలో కౌంటింగ్ హాల్‌లోకి తీసుకు వచ్చి ఓట్ల లెక్కింపు చేపడతారు. సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పోలీస్, రాష్ట్ర పోలీసుల ద్వారా మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహిస్తాం

గోషామహల్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పార్టీల ఏజెంట్‌లకు పాస్‌ల జారీ చేయడంతో పాటు ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్‌లను ఏర్పాటు చేసి 17 రౌండ్‌లలో మొత్తం ఓట్ల లెక్కింపును పూర్తి చేయనున్నాం.

–వి. విక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్ కష్టాలు

మెహిదీపట్నం, మే 25 : ప్రజలకు అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ప్రధాన రోడ్లలో ఉన్న వ్యాపార, వాణిజ్య సముదాల వారు పార్కింగ్ సౌకర్యం కల్పించక పోవడంతో వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు సర్వసాధారణంగా మారాయి. నానల్‌నగర్ నుంచి టోలిచౌకి వెళ్లే పాత ముంబయి ప్రధాన రోడ్డులో ఉన్న షాగౌస్, మందార్, పిస్తా హౌస్ హోటల్స్ కారణంగా ఈ రోడ్డులో ఇరువైపులా ఎప్పుడు చూసినా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది. ఓ వైపు ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేస్తున్నా హోటల్స్ యజమాన్యాలకు చీమకుట్టినట్లుగా కూడా లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నానల్‌నగర్–టోలిచౌకి రోడ్డులో షాగౌస్ హోటల్ వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి

హోటల్స్ యజమానులు తప్పనిసరిగా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలు పాటించకుంటే పార్కింగ్ లేని హోటల్స్ యజమానులపై చర్యలు తీసుకొంటాం. ట్రాఫిక్ జామ్ కాకుండా సిబ్బందిని అదనంగా నియమించి చర్యలు తీసుకుంటాం. రద్దీ వేళల్లో ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు.

– అంజయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, లంగర్‌హౌస్

చెత్తరహిత ప్రాంతంగా అంబర్‌పేట

అంబర్‌పేట, మే 25 : చెత్తరహిత ప్రాంతంగా అంబర్‌పేట సర్కిల్‌ను తీర్చిదిద్దుతామని సర్కిల్ మెడికల్ ఆఫీసర్(ఏఎంఓహెచ్) డాక్టర్ హేమలత అన్నారు. శనివారం సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌పోర్ట్ పాయింట్‌ను ఉన్నతాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి రోజూ చెత్త సేకరణ చేయాలని, సేకరించే సమయంలో ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయవద్దన్నారు. ప్రజలతో ఇష్టానుసారంగా మాట్లాడవద్దని, చెత్త సేకరణపైనే పూర్తిస్థాయి దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలో జీవీపీ ఎలిమినేషన్ లక్ష్యం చేరుకోవాలంటే అందరి సహకారం కీలకమని తెలిపారు. గతంలో ఉన్న గార్బేజ్ వాల్నరేబుల్ పాయింట్స్‌ను కొంతవరకు తొలగించగలిగామని, అదే స్ఫూర్తితో జనం సహకారం తీసుకొని కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆదేశాల మేరకు అంబర్‌పేటను స్వచ్ఛ ప్రాంతంగా తీర్చిదిద్దడానికి నడుం బిగించాలని కోరారు. శానిటరీ సూపర్‌వైజర్ తిరుపతినాయక్, రాంకీ, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశమైన ఏఎంఓహెచ్ హేమలత

బీసీల రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ

కాచిగూడ, మే 25 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. గుజ్జ కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కులగణన పట్ల సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన అనంతరమే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నీల వెంకటేశ్, జనార్దన్, నందగోపాల్, వీ.రామకృష్ణ, ఉదయ్, ప్రణితరాణి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి గజవాహన సేవ..

చిక్కడపల్లి, మే 25 : చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం స్వామివారి గజవాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.రామంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చేతి వృత్తులను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

ఎన్టీఆర్ స్టేడియంలో చేనేత వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

కవాడిగూడ, మే 25: చేతి వృత్తులను ప్రోత్సహించాల్సిన బాధ్యత వినియోగదారులపై ఉందని టీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం రాత్రి అయన సందర్శించారు. వివిధ రాష్ట్రాల వస్త్రాలను తిలకించారు. తక్కువ ధరలో అన్ని రకాల దుస్తులు అందరికీ అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జూన్ 9 వరకు వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేనేత కళలను రాబోయే తరాలకి అందించేలాగా కృషి చేయాల్సినవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ చైర్మన్ దేవకీదేవి ఆర్గనైజర్ మహేశ్ నిర్వాహకురాలు సత్యనారాయణ చౌదరి, సాయిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం సాధించాలని చాదర్ సమర్పణ

అబిడ్స్, మే 25 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 12 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ 12 స్థానాల్లో విజయం సాధించాలని గుల్బర్గాలోని ఉర్సు షరీఫ్ దర్గాలో చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎండీ అజహర్ షేక్, ముష్ఫి,ఆసిఫ్ ఖాస్మి, షహీద్, మహ్మద్ ఖలీల్, యూనస్, నయీం, హఫీజ్ అబ్దుల్ ఖయ్యూం పాల్గొన్నారు.

గుల్బర్గాలోని ఉర్సు షరీఫ్ దర్గాలో చాదర్ సమర్పించేందుకు వెళ్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ తదితరులు

ఏవీ కళాశాలలో నాలుగు కొత్త కోర్సులు

కవాడిగూడ, మే 25 : హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ సైన్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ స్థాయిలో 4 కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, కరస్పాండెంట్ కే. గౌతమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా ఈ కోర్సులు దోహదం చేస్తాయని వివరించారు. బీఏ జర్నలిజం, డాటా సైన్స్, బీకాం ఫైనాన్స్, బయోటెక్నాలజీ లాంటి కోర్సులను విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అందుబాటులోకి తీసుకురానున్నదని తెలిపారు. ఈ నాలుగు కోర్సులకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్‌లో ఉన్నాయని అన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా గమనించి కోర్సులను ఎంచుకోవాలని కోరారు.

ప్రిన్సిపాల్ సీహెచ్ రాజలింగం

ఆత్మ విమర్శలు అధికమైతే ఆందోళన..

చిక్కడపల్లి, మే 25 : ఆత్మ విమర్శలు అధికమైతే ఆందోళన ఏర్పడుతుందని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ రవ్వ హరికుమార్ అన్నారు. ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్‌లోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ఆందోళన నిర్మూలన మార్గాలపై ఒక రోజు జాతీయ స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. వీటిని గుర్తిచడం, సమస్యల నుంచి ఎలా బయటపడాలో వివరించారు. ఈ సమావేశంలో తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ జి. వీరభద్రం, డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్, డాక్టర్ క్వార్లిన్, డాక్టర్ రఘు, శ్రీనివాస్, షహీనా, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న డాక్టర్ రవ్వ హరికుమార్, డాక్టర్ హిప్నోపద్మాకమలాకర్ తదితరులు

కలల సాకారానికి విద్యార్థులు కృషి చేయాలి

కాచిగూడ, మే 25 : విద్యార్థులు తాము కనే కలలను సాకారం చేసుకోవడానికి అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెస్సార్ లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ ఎస్. సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. వర్ణిక ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'జీవితంలో విజయం సాధించడం ఎలా' అనే అంశంపై కాచిగూడలోని అమృత ఆర్కేడ్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంపోసియం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సూర్యప్రకాశ్ హాజరై మాట్లాడారు. అధ్యక్షత వహించిన న్యాయవాది కాసుల వినోద్ మాట్లాడుతూ.. వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వర్ణిక ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ తనవంతు కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ హైకోర్టు న్యాయవాది కానుగు దేవేందర్, విశిష్ట అతిథిగా వి సొల్యూషన్స్ అధినేత కాసుల మల్లికార్జున్ హాజరయ్యారు. కార్యక్రమంలో లక్ష్మణ, గంగాభవాని,అనికేత్, వర్ణిక, శృతిక, విశాంత్, అనన్య, వరుణ్, శ్లోక తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్. సూర్యప్రకాశ్, విద్యార్థులు

కళలు సజీవంగా ఉంటాయి..

రవీంద్రభారతి, మే 25 : కళలు తెలుగు నేలపై సజీవంగా ఉంటాయని కూచిపూడి నాట్యగురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు అన్నారు. భారతవేద ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోదా కల్యాణం కూచిపూడి యక్షగానం శనివారం రవీంద్రభారతిలోని ప్రదాన వేదికపై నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పసుమర్తి శేషుబాబు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస వరప్రసాద్ శిష్య బృందంచే గోదా కల్యాణం కూచిపూడి యక్షగానం నృత్య ప్రదర్శన వీక్షకులను అలరించింది. కార్యక్రమంలో భారత్ వేద ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస వరప్రసాద్, డాక్టర్ విజయ్‌పాల్, కేశవరావు, డాక్టర్ ఆదిత్య కిరణ్ పాల్గొన్నారు.

గోదా కల్యాణ కూచిపూడి యక్షగాన ప్రదర్శనలో కళాకారులు

గృహిణి అదృశ్యం

కాచిగూడ, మే 25: గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికుమార్ తెలిపిన ప్రకారం.. చెప్పల్‌బజార్‌కు చెందిన నరేందర్ భార్య కడేల్ తేజస్విని (38) ఈనెల19న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త నరేందర్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తెల్ల రంగు పైజామా ధరించి, 5.7 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన కడేల్ తేజస్విని

గంజాయి విక్రేతల అరెస్ట్

- 26.5 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

అబిడ్స్, మే 25 : విక్రయిస్తున్న వారిపై మంగళ్‌హాట్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. జాలిహనుమాన్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ బిజయాబాయి(48), అభిషేక్‌సింగ్(19)ను అరెస్ట్ చేసి వారి నుంచి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా మరో నిందితుడు టింకూసింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మరో కేసులో రహీంపురా ప్రాంతానికి చెందిన సంగీత(62), ఎం.అజయ్‌కుమార్(25)ను వేర్వేరుగా అరెస్ట్ చేసి వారి నుంచి 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ తెలిపారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు గమనిస్తే తమకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

మరో ఘటనలో..

- 22 కిలోల గంజాయి రూ.8.74 లక్షల నగదు స్వాధీనం

అబిడ్స్, మే 25 : గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న తండ్రీ కొడుకులను తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరోతో కలిసి షాహినాయత్‌గంజ్ పోలీసులు అరెస్ట్‌చేసి 22 కిలోల గంజాయితో పాటు రూ.8.74 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సౌత్‌వెస్ట్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ స్నేహ మెహ్రా తెలిపారు. లోయర్ ధూల్‌పేట జుమ్మేరాత్ బజార్‌కు చెందిన చురమన్ మేఖేష్ సింగ్ (51) గంజాయి వ్యాపారి. అతని కుమారుడు చురమన్ అభిషేక్ సింగ్ (25)తో కలిసి టీఎస్-13 ఈఎం 6819 నంబరు గల హోండా యాక్టీవాపై వస్తుండగా జుమ్మేరాత్ బజార్లోని అవంతీబాయి విగ్రహం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చి వీరి వాహనాన్ని తనిఖీ చేయగా తెలుపు రంగు పాలీమర్ బ్యాగులో ఇరవై కిలోల గంజాయి లభించింది. దీంతో ఇంట్లో తనిఖీలు చేయగా రెండు కిలోల గంజాయి, రూ.8.74 లక్షల నగదు లభించింది. ఈ నగదు కూడా గంజాయి విక్రయించడం ద్వారా సంపాధించిందేనని తేలింది. ఈ మేరకు వీరిద్దరినీ అరెస్ట్ చేసిన పోలీసులు వీరికి గంజాయిని సమకూర్చిన హయత్‌నగర్‌లోని శివం మిల్స్ కాలనీకి చెందిన వరికుప్పల మల్లేశ్ (32) కోసం గాలిస్తున్నారు.

వైద్యుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలి

- మెడికల్ కళాశాలల వైద్యులు

సుల్తాన్‌బజార్, మే 25 : జూన్‌లో చేపట్టనున్న వైద్యుల సాధారణ బదిలీలను ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మెడికల్ కళాశాలల వైద్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం కోఠిలోని డీఎంఈ డాక్టర్ వాణికి 33 జిల్లాల మెడికల్ కళాశాలల వైద్యుల బృందం వినతి పత్రం అందజేసింది. అనంతరం డాక్టర్లు వి.శేఖర్, చంద్రశేఖర్, జగతి, సాంబశివారెడ్డి, ఎం. కవిత మాట్లాడుతూ.. వైద్యుల సాధారణ బదిలీల్లో అసోసియేషన్ నాయకుల పాత్ర లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వైద్యులకు స్థాన చలనం కల్పించడంతో పాటు రెండేళ్లకు మించి గ్రామీణ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. సాధారణ బదిలీల్లో బదిలీ కావల్సిన కొందరు వైద్యులు అసోసియేషన్‌ల ముసుగులో గత పదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్నారని, దీంతో వారి ఆగడాలు మితిమీరిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యుల బదిలీలను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయమై డీఎంఈతో సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. డాక్టరర్లు సూర్యనారాయణ, అజమ్, అమరావతి, కవిత, హేమలత, అరుణ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

డీఎంఈ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న వివిధ మెడికల్ కళాశాలల వైద్యులు

28 నుంచి రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

సుల్తాన్‌బజార్, మే 25 : జియాగూడలోని శ్రీ రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈ నెల 28 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఎస్‌టీ చారి, ప్రతినిధి శేషాచార్యులు, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ, బద్రీనాథ్ తెలిపారు. శనివారం జియాగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో బస్తీ సంఘాలు, పలు పార్టీల ప్రతినిధులతో కలిసి వారు బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుసమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 28 ఉదయం అభిషేకం, అర్చనలు, సాయం త్రం రక్షాబంధనం ఉంటాయన్నారు. 30న గరుడ ప్రణీదా ఉంటుందని పిల్లలు కాని వారు, వ్యాధిగ్రస్తులు స్వీకరిస్తే మేలు జరుగుతుందన్నారు.31న సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత, రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 1న పూర్ణాహుతి, స్వామి వారి రథోత్సం, 2న అభిషేకం, చక్రస్నానం, సాయంత్రం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, 3న నిత్య పూజలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాద శ్రీనివాస్ గుప్తా, డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, ఎం.కిశోర్‌కుమార్, మోహన్, బీజేపీ నాయకులు జీ. చంద్రకాంత్, ఏ సుదర్శన్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, వివేక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌టీ చారి, శేషాచార్యులు, తదితరులు

వాస్కోడిగామా రైలులో చోరీ

కాచిగూడ,మే 25: వాస్కోడిగామా రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్‌కు చెందిన సర్దార్ వీరేంద్రసింగ్(39) గోవా-కాచిగూడ వాస్కోడిగామా రైల్లో కాచిగూడకు వస్తుండగా కర్నూల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వీరేంద్రసింగ్ బ్యాగులో ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ. 4 వేలు, ఫోన్, ఏటీఎం, ఆధార్ కార్డులను దొంగిలించి పారిపోయారు. శనివారం బాధితుడు వీరేంద్ర సింగ్ పోలీసులకు చేసిన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ బీజీ ప్రసాద్ రావు తెలిపారు.

బీసీల సంక్షేమానికి మల్లయ్య చేసిన సేవలు మరువలేనివి..

కవాడిగూడ, మే 25: బీసీల హక్కుల కోసం, గంగపుత్రుల సంక్షేమానికి ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉపాధ్యక్షుడు గూడబోయిన శివరత్నం, ఏర్వ బాలయ్య, కోశాధికారి ఎర్రబోయిన మల్లేశ్ అన్నారు. శనివారం తెలంగాణ గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏఎల్ మల్లయ్య 86వ జయంతి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్‌కే భగవాన్, అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్ర, కంటె రాంచందర్, వెలకటస్వామి, సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు రాచమల్ల స్వర్ణలత, ప్రధాన కార్యదర్శులు చెరక సంగీత, ఎం. సునీత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఏఎల్ మల్లయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నాయకులు

హజ్‌యాత్ర .. అదృష్టం

ముస్లింలు హజ్‌యాత్ర చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తారని టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్ అన్నారు. శనివారం హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ఎంఐఎం నాయకులతో కలిసి అదనపు ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్ జెండా ఊపి శుభాకాంక్షలు తెలిపారు. – మెహిదీపట్నం, మే 25

దారి దోపిడీ.. నిందితుల అరెస్టు

సుల్తాన్‌బజార్, మే 25 : రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని దారికాచి దోపిడీ చేసిన ఘటనలో ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సుల్తాన్‌బజార్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి వివరాల ప్రకారం.. మహ్మద్ ఫిరోజ్(27) ఈ నెల 19 న ఇంట్లోంచి మందులను కొనుగోలు చేసే నిమిత్తం బయటికి వెళ్లాడు. రాత్రి 7.30 గంటలకు సంగీత ట్రావెల్స్ వద్ద ఫిరోజ్‌ను గుర్తు తెల